

జీసీసీని వదిలేశారు!

- వైసీపీ పాలనలో నిర్వీర్యం
- అటవీ ఉత్పత్తులకు కానరాని గిట్టుబాటు ధర

(మెళియాపుట్టి)

గిరిజనులకు అండగా నిలిచి.. వారు సేకరించే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఏర్పాటు చేసిన జీసీసీ(గిరిజన కార్పొరేషన్ సంస్థ)ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. 1960లో మార్కెటింగ్ సొసైటీగా ఏర్పడి.. గిరిజన సహకార సంస్థగా ఎన్నో సేవలు అందించింది. గత వైసీపీ ప్రభుత్వం.. జీసీసీని గాలికి వదిలేయడంతో.. గిరిజనులకు నష్టం వాటిల్లుతోంది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో జీసీసీ ఉండేది. జిల్లా పునర్విభజన తర్వాత పాతపట్నంలో జీసీసీ కేంద్రంగా సేవలు అందిస్తున్నారు. సీతంపేట పరిధిలో 36 డిపోలు ఉన్నాయి. జిల్లాలోని మెళియాపుట్టి, కంచిలి, మందస, నందిగాం, టెక్కలి, పాతపట్నం, హిరమండలం, పలాస, సారవకోట మండలాల్లో మొత్తంగా 22 డీఆర్ డిపోలను ఏర్పాటు చేశారు. గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లకు భవనాలు సైతం నిర్మించారు. వైసీపీ పాలనలో వాటిని పూర్తిగా వదిలేయడంతో.. శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని భవనాల స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. పాతపట్నం జీసీసీ పరిధిలోని అధికంగా డిపోలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నిధులు మంజూరు కాకపోవడంతో వినియోగించలేని పరిస్థితి నెలకొంది.



శిథిలావస్థలో అచ్చనాపురం జీసీసీ డిపో..



అనంతగిరిలో విక్రయాలు లేక కొండచీపుర్లు ఇలా..



గిరిజనులు పోగుపోసిన కుంకుడు కాయలు

కానరాని కొనుగోళ్లు

గిరిజనులు పండించే రాగులు, కొర్రలు, జొన్నలు, కందులు, చిరుధాన్యాలతోపాటు జీడిపిక్కలు, పైనాపిల్, చింతపండు, కొండచీపుళ్లు, పసుపు, నల్లజీడి, పరమామిడి చెక్క, జిగురు వంటి ఉత్పత్తులు జీసీసీలో కొనుగోలు చేయాలి. కాగా.. జీసీసీ మొక్కుబడిగా కొనుగోలు చేసి వదిలేయడంతో గిరిజనులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. గిరిజనుల ప్రధాన పంట చింతపండును గతంలో జీసీసీ ద్వారా వేల టన్నుల్లో కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం కొనుగోలు లేక గిరిజనులు సంతల్లో విక్రయిస్తున్నారు. దీనివల్ల అదనపు కష్టం తప్ప.. ఆదాయం లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

స్టాక్‌పాయింట్లు, కోల్డ్‌స్టోరేజీలు ఎక్కడ?

స్టాక్‌పాయింట్లు, కోల్డ్ స్టోరేజీలు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. పాతపట్నం మండలం పరిధిలో స్టాక్ పాయింట్ గొడౌన్‌లు నిర్మిస్తామని, అక్కడకు పంట ఉత్పత్తులు తీసుకొని వచ్చి అమ్ముకొనే విధంగా చర్యలు తీసుకుంటామని గత ప్రభుత్వంలో గిరిజన కమిషన్ ఛైర్మన్ కుంభా రవిబాబు హామీ ఇచ్చారు. కానీ, అది కార్యరూపం దాల్చలేదు. అలాగే కోల్డ్‌స్టోరేజీలు లేక చింతపండు, పనస, జీడిపిక్కలు, నల్లజీడి, పైనాఫిల్ వంటి పంటలను నిల్వలు చేసుకొనే అవకాశం ఉండడం లేదు. దీంతో తక్కువ ధరకే గిరిజనులు తమ పంటలను దళారులకు అమ్ముకుంటున్నారు. దళారులు ఆ పంటలను తమ కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచి ధరలు పెరిగిన తరువాత అమ్మకాలు చేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం సీతంపేట ఐటీడీఏ పరిధిలో రెండు స్టోరేజ్ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వాటిని వదిలేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో కోల్డ్‌స్టోరేజీల నిర్మాణంపై గిరిజనులు ఆశలు పెట్టుకున్నారు.

సిబ్బంది కొరత

జీసీసీలో సుమారు 10మంది సిబ్బంది కొరత ఉన్నట్లు తెలుస్తోంది. దీనివల్ల వ్యాపారం సక్రమంగా చేయలేని పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం 8 మంది కాంట్రాక్టు సేల్స్‌మెన్లతోపాటు 9 మంది రెగ్యులర్ సెల్స్‌మెన్ల ద్వారా సేవలు అందిస్తున్నారు. పాతపట్నం కార్యాలయంలో ముగ్గురితో కాలం గడుపుతున్నారు. అరకొర సిబ్బందితోనే గిరిజనుల నుంచి పంట ఉత్పుత్తుల కొనుగోలు, డిపోల ద్వారా బియ్యం, నిత్యావసరాలను అమ్మకాలు సాగిస్తున్నారు.

అందని రుణాలు..

వ్యవసాయ కాలంలో గిరిజనులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలి. దీంతో పాటు డిపోల ద్వారా నిత్యావసర సరుకులు తక్కువ ధరకే ఇవ్వాలి. కానీ ఇవి ఎక్కడా అమలయ్యే పరిస్థితి కనిపించలేదు. గత ఐదేళ్లలో గిరిజనులకు ఎటువంటి రుణాలు అందజేయలేదు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో తక్కువ వడ్డీకే రూ.10కోట్ల వరకు రుణాలు అందించారు. జగన్ సర్కారు మాత్రం గత ఏడాది రూ.10లక్షలు మాత్రమే రుణాలు ఇచ్చింది. దీంతో గిరిజన రైతులు దళారుల వద్ద అప్పు చేసి పెట్టుబడులు పెడుతున్నారు. దీన్నివల్ల దళారులు చెప్పిన ధరకే పంటలను విక్రయించాల్సి వస్తోంది. అదే విధంగా గిరిజన కార్పొరేషన్‌ను కూడా వైసీపీ సర్కారు నిర్లక్ష్యం చేసింది. గతేడాది రూ.40.31కోట్లు విలువైన పంట ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. వాస్తవ లక్ష్యం రూ.23.48కోట్లు అయినప్పటికీ అధికంగా కొనుగోలు చేపట్టినా కార్పొరేషన్‌ను పట్టించుకున్న దాఖలాలు లేవు. కార్పొరేషన్‌కు వచ్చిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడంతో తాము నష్టపోయినట్లు గిరిజన రైతులు చెబుతున్నారు. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వమైనా జీసీసీని గాడిన పెట్టేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని వేడుకుంటున్నారు.

కష్టమే మిగులుతోంది..



ప్రతి ఏడాది కొండలపై కష్టపడి పంటలు పండిస్తున్నా వాటికి సరైన మద్దతు ధరలు ఉండడం లేదు. దీంతో నష్టపోతున్నాం. గతంలో జీసీసీ ద్వారా పంటలు కొనుగోలు చేసేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎలాంటి కొనుగోలు చేపట్టలేదు. నూతన ప్రభుత్వమైనా జీసీసీ ద్వారా కొనుగోలు జరిగేలా చర్యలు చేపట్టాలి.

-జె.ప్రకాశరావు, వెంకటాపురం

కొండచీపుర్లను కొనడం లేదు..



గత మూడేళ్ల నుంచి రెండు ఎకరాల్లో కొండ చీపుర్లను పండిస్తున్నా. కానీ, కొనుగోలు చేసేవారు కరువయ్యారు. ఆరు నెలల బట్టి పంటను కోత కోసి నిల్వ చేసుకోవాల్సి వస్తుంది. జీసీసీ అధికారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో కిలో రూ.50 నుంచి రూ.70 వరకు దళారులకు అమ్మకోవాల్సి వస్తోంది. దీనివల్ల నష్టపోతున్నా.

- ఎస్.సరస్వతి, అనంతగిరి

మద్దతు ధరలు ఇస్తున్నాం

గిరిజన రైతుల అటవీ ఉత్పత్తులకు ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటిస్తుంది. దాని ప్రకారం కొనుగోలు చేస్తున్నాం. ప్రతి గిరిజన రైతునూ ఆదుకొనే విధంగా ప్రణాళికలు తయారు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

- జి.నర్సింగులు, జీసీసీ, మేనేజర్, పాతపట్నం బ్రాంచ్

నేడే పింఛన్ల పండగ

- జిల్లావ్యాప్తంగా 3,19,119 మంది లబ్ధిదారులు
- ఉదయం 6 గంటల నుంచే పంపిణీ
- గత నెల కంటే అదనంగా రూ.118.39 కోట్లు
- భాగస్వామ్యం కానున్న ప్రజాప్రతినిధులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పండుగకు సర్వం సిద్ధమైంది. మొన్నటి ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెంచిన సామాజిక భద్రతా పింఛన్లు సోమవారం నుంచి పంపిణీ చేయనున్నారు. పింఛనుదారుల ఇంటి వద్దే సచివాలయ సిబ్బంది ద్వారా ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేయడానికి ప్రభుత్వం పటిష్ఠమైన ఏర్పాట్లు చేసింది. పింఛన్ల పంపిణీకి సంబంధించిన విధి విధానాలను ఇప్పటికే సచివాలయ సిబ్బందికి స్పష్టం చేసింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి కార్యక్రమం కావడంతో పింఛను పంపిణీకి ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు అమరావతిలోని పెనుమాక ప్రాంతంలో పాల్గొనున్నారు. అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా భాగస్వామ్యం కానున్నారు. లబ్ధిదారులకు పింఛన్ నగదుతోపాటు సీఎం చంద్రబాబు విడుదల చేసిన లేఖను కూడా అందజేయనున్నారు.

మొత్తం రూ.211.69 కోట్లు

జిల్లాలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళ, చేనేత కార్మికులతోపాటు వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు 3,19,119 మంది ఉన్నారు. వీరందరికీ జూన్ నెలలో వైసీపీ ప్రభుత్వం రూ.93.3 కోట్లు పంపిణీ చేసింది. సామాజిక పింఛన్‌దారుడికి ప్రతి నెలా రూ.3వేలు చొప్పున అందజేసింది. అయితే తాము అధికారంలోకి వస్తే పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతామని, ఏప్రిల్ నుంచే దీనిని వర్తింపజేసేలా చేస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు జూలై నుంచి సామాజిక పింఛన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచారు. దీంతోపాటు ఏప్రిల్, మే, జూన్‌కు సంబంధించి రూ.వెయ్యి చొప్పున మరో రూ.3వేలు లబ్ధిదారులకు అందజేయనున్నారు. దివ్యాంగులు, కుష్టురోగులకు రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్నవారు, ప్రమాద బాధితుల పింఛన్‌ను కూడా పెంచారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ నెల రూ.211.69 కోట్లు మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. అంటే గత నెల కన్నా.. రూ.118.39 కోట్లు అదనపు భారం ప్రభుత్వంపై పడనుంది. జిల్లాలో 732 గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సోమవారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేసేలా అధికారులు సన్నద్ధమవుతున్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకుని.. పింఛన్లు పెంచడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు జిల్లాకు రవాణా శాఖ మంత్రి రాక

శ్రీకాకుళం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్ల రామప్రసాద్‌రెడ్డి సోమవారం జిల్లాకు రానున్నారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు విశాఖపట్టణం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 8.30 గంటలకు నిమ్మాడ చేరుకుంటారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడితో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 10.30గంటలకు నిమ్మాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం వెళ్తారు.

25 రోజుల తరువాత స్వగ్రామానికి..

- సౌదీ అరేబియా నుంచి చినవంకకు చేరిన శంకర్ మృతదేహం



వజ్రపుకొత్తూరు, జూన్ 30: వజ్రపుకొత్తూరు మండలం చినవంకకు చెందిన మదనాల శంకరరావు.. అలియాస్ సతీష్ మృతదేహం.. సౌదీ అరేబియా దేశం నుంచి ఎట్టకేలకు స్వగ్రామానికి చేరుకుంది. చినవంక గ్రామానికి చెందిన మదనాల సూర్యనారాయణ, కాంతమ్మ దంపతుల కుమారుడు శంకర్ మూడేళ్ల కిందట ఉపాధి కోసం ఖతర్ దేశం వెళ్లాడు. అయితే, తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో స్వగ్రామానికి వచ్చేశాడు. అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటున్నాడు. తల్లి వైద్యం కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. అయినా తల్లి కాంతమ్మ ఏడాది కిందట మృతి చెందింది. దీంతో అప్పుల భారం పెరగడంతో నాలుగు నెలల కిందట ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లాడు. ఈ నెల 5న అక్కడ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. అప్పటి నుంచీ శంకరరావు మృతదేహం కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. 25 రోజుల తర్వాత ఆదివారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు పలుకుతూ అంత్యక్రియలు పూర్తిచేశారు. గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల, జూన్ 30: ఇంజనీరింగ్ కోర్సుల్లో ఎంపీసీ స్ట్రీమ్‌లో ప్రవేశానికి ఏపీ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ ఆన్‌లైన్‌లో సోమవారం ప్రారంభమవుతుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(శ్రీకాకుళం) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, హెల్ప్‌లైన్ కేంద్రం కోఆర్డినేటర్ జి.దామోధరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'జూలై 1 నుంచి 7 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600 చొప్పున ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. జూలై 4 నుంచి 10వరకు సర్టిఫికేట్ల పరిశీలన ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. 8 నుంచి 12వ తేదీలోగా విద్యార్థులు కళాశాలలు, కోర్సుల ఎంపికకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. 13న ఆప్షన్ల నమోదులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. 16న సీట్లు కేటాయిస్తారు. 17 నుంచి 22వ తేదీలోగా సీటు పొందిన కళాశాలలో విద్యార్థులు రిపోర్ట్ చేయాలి. 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి' అని ప్రిన్సిపాల్ దామోదరరావు తెలిపారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు, సందేహాలు ఉన్నా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

వైసీపీ కార్యాలయం కోసం.. మా స్థలాన్ని కబ్జా చేశారు

- మంత్రి అచ్చెన్నాయుడుకు బాధిత ఉపాధ్యాయుల ఫిర్యాదు
- ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ


టెక్కలి, జూన్ 30: 'మేమంతా ఉపాధ్యాయులం. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం.. శ్రీకాకుళంలోని పెద్దపాడు రెవెన్యూ పరిధిలో వేసిన లేఅవుట్‌లో 1991-93 మధ్యకాలంలో ఒక్కొక్కరం ఐదున్నర సెంట్లు చొప్పున స్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. మాకు తెలియకుండా వైసీపీ ముఖ్య నాయకులు, కొందరు అధికారులు మా స్థలంలో వైసీపీ జిల్లా కార్యాలయాన్ని నిర్మించారు. దీనిపై ప్రశ్నిస్తే అధికారులు తమకేమీ తెలియదంటూ చేతులు దులుపుకొంటున్నారు. మా స్థలం మాకు దక్కేలా న్యాయం చేయాలి' అని పలువురు బాధిత ఉపాధ్యాయులు మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. ఈ మేరకు ఆదివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో అచ్చెన్నకు వినతి పత్రాన్ని అందజేశారు. కోటబొమ్మాళికి చెందిన జీవీ రమణ (ప్లాట్‌నెంబర్-238), నరసన్నపేట మండలం దేవాది గ్రామానికి చెందిన దుబ్బ పార్వతి(ప్లాట్ నెంబర్- 234), శ్రీకాకుళం విశాఖ బి.కాలనీకి చెందిన రావాడ మణికుమారి (ప్లాట్ నెంబర్-233) పేరిట కొనుగోలు చేసిన స్థలాల్లో వైసీపీ కార్యాలయాన్ని అక్రమంగా నిర్మించారని ఆరోపించారు. దీనిపై పరిశీలించి న్యాయం చేస్తామని అచ్చెన్నాయుడు బాధితులకు హామీ ఇచ్చారు. అలాగే సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజాదర్బార్‌లో వినతులు వెల్లువెత్తాయి.

- టెక్కలిలో కోర్టు సముదాయానికి భవనాలు లేవని, కోర్టు భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరుకు కృషి చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, పినకాన అజయ్‌కుమార్, ధవళ రాజేశ్వరరావు తదితరులు మంత్రి అచ్చెన్నకు వినతిపత్రం అందజేశారు.
- గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అనేక కష్టాలు పడ్డామని, తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు మంత్రి అచ్చెన్నను కోరారు.
- ఏళ్ల తరబడి పనిచేస్తున్నామని, తమ పదవీ విరమణ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ మినిమమ్ టైమ్‌స్కేల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు మెండ వెంకటరావు, వై.శ్రీనివాసరావు కోరారు.
- ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సీఆర్‌టీలను రెగ్యులైజేషన్ చేయాలని, డీఎస్సీలో ఆ పోస్టులు మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ప్రాథమిక పాఠశాల కాంట్రాక్ట్, రెసిడెన్షియల్ ఉపాధ్యాయ సంక్షేమ సంఘం ప్రతినిధులు డి.రామయ్య, జె.క్రిష్ణారావు విజ్ఞప్తి చేశారు.
- మినిమం టైమ్‌స్కేల్‌తోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ ఈ-పంచాయతీ డేటా ఎంట్రీ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ రాజు వినతిపత్రం అందజేశారు.
- గత ప్రభుత్వ హయాంలో అర్బన్ హెల్త్‌సెంటర్లలో పనిచేసిన వైద్యులు, స్టాఫ్‌నర్స్ ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్, ఏఎన్‌ఎం వంటి పోస్టులు పక్కన పెట్టారు. మాకున్న క్వాలిఫికేషన్ మేరకు ఆ పోస్టులను తిరిగి భర్తీ చేయాలని ఎస్.రామకిషోర్, జి.వెంకటరమణయ్య తదితరులు అర్జీలు అందజేశారు.
- కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి వానవారి చెరువు శ్మశానవాటిక దగ్గర బోరుబావి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.
- టెక్కలి మండలం సింగుమహంతిపేట గ్రామస్థులు తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఊరగెడ్డలో పూడికలు తొలగించాలని, సీసీ రహదారులు నిర్మించాలని అర్జీలు అందజేశారు.



స్థలాన్ని కబ్జా చేశారంటూ మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేస్తున్న బాధిత ఉపాధ్యాయులు

సాగుకు వంశధార



గొట్టాబ్యారేజీ

(హిరమండలం)

వంశధార ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదల చేయనున్నారు. గొట్టాబ్యారేజీ కుడి, ఎడమ కాలువల ద్వారా సోమవారం ఉదయం 6.30గంటలకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చేతుల మీదుగా సాగునీటిని విడుదల చేయనున్నట్టు వంశధార ప్రాజెక్టు ఎస్ఈ బి.రాంబాబు తెలిపారు. జిల్లాలో వంశధార ఎడమ కాలువ ద్వారా 104కి.మీల మేర ఉన్న హిరమండలం, సారవకోట, జలుమూరు, పోలాకి, నరసన్నపేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పలాస మండలాల్లో 398గ్రామాల్లోని 1,48,200 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. కుడి కాలువ పరిధిలోని హిరమండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార, బూర్జ మండలాల్లోని 82 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నారు. ప్రస్తుతం గొట్టాబ్యారేజీలో 1,060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. బ్యారేజీ ఎగువ ప్రాంతంలో 37.80 మీటర్ల మేర నీరు నిల్వ చేస్తూ 700 క్యూసెక్కులను.. 2గేట్లు పైకెత్తి కిందకు విడిచిపెడుతున్నారు..



కుడి హెడ్‌రెగ్యులేటర్ గేట్ల నుంచి నీరు లీకేజీ

నేడు గొట్టాబ్యారేజి కుడి,ఎడమ కాలువల ద్వారా సాగునీరు విడుదల

● ఆయకట్టుకు నీరందేనా?

వంశధార ఎడమ, కుడి ప్రధాన కాలువల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఏటా నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గుతూ ఎక్కడో ఒక చోట గండ్లు పడుతున్నాయి. ఎడమ కాలువ ద్వారా 2,480 క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యం కాగా 1,800 క్యూసెక్కులకు మించి నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. శివారు భూముల వరకు సాగు నీటిని అందించాలంటే 2వేల క్యూసెక్కులకు పైగా విడిచి పెట్టాల్సి ఉంది. నీటి పరిణామం పెంచితే కాలువ గట్లు కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడుతుంది. 1971-78 సంవత్సరాల మధ్య నిర్మించిన కాలువలు లైనింగ్ లేక చాలావరకు పూడుకుపోయాయి. కొన్నిచోట్ల అండర్ టన్నెల్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. నీటి నిర్వహణలో ప్రధాన భూమిక పోషించే షట్టర్లు, గేట్లు పాడైపోయాయి. రెండేళ్ల కిందట కిట్టాలపాడు సమీపంలో అండర్ టన్నెల్ కూలిపోయి వారం రోజులకుపైగా 1.40లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరా నిలిచిపోయింది. కాలువల ఆధునీకకరణకు గతేడాది వంశధార అధికారులు రూ.850 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపినా.. వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో తమకు సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారైనా ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందిచేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

● పట్టని బ్యారేజీ మరమ్మతులు

గొట్టాబ్యారేజి 24 గేట్లతో పాటు దానికి అనుసంధానంగా ఉన్న కుడి, ఎడమ కాలువల హెడ్ రెగ్యులేటర్ గేట్లకు ఐదేళ్లుగా నిర్వహణ లేక పాడైపోయాయి. బ్యారేజీ ఎగువ ప్రాంతంలో నీరు నిల్వ చేసేందుకు గేట్లు దించినప్పటికి లీకేజీ ద్వారా నీరు వృథాగా పోతోంది. 2018లో గేట్లకు మరమ్మతులు చేశారు. వైసీపీ పాలనలో బ్యారేజీ నిర్వహణను పట్టించుకోకపోవడంతో గేట్లకు సంబంధించి బేరింగ్‌లు, రోలర్లు పూర్తిగా పాడైపోయాయి. బ్యారేజీ దిగువ భాగాన జడ్డిస్టోన్ ఏప్రాన్ పూర్తిగా దెబ్బతింది. ఇంజనీరింగ్ నిపుణుల సూచన మేరకు జడ్డిస్టోన్ ఏప్రాన్ స్థానంలో కాంక్రీట్ ఎప్రాన్ నిర్మాణం చేపట్టేందుకు ఐదేళ్ల కిందట రూ.8.5కోట్లు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టరు పది శాతం పనులు చేసి నిలిపివేశాడు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. టీడీపీ హయాంలో 25శాతంలోపు చేపట్టిన పనులను రద్దు చేయడంతో గొట్టాబ్యారేజీ పరిస్థితి దయనీయంగా మారింది. సీసీ ఏప్రాన్ తక్షణమే నిర్మించకపోతే బ్యారేజీకి ముప్పు తప్పదని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేసున్నారు. ఎడమ కాలువ గేట్లు కూడా పాడైపోయాయి. గేట్ల నుంచి లీకేజీ ద్వారా సుమారు 100 క్యూసెక్కులు కాలువలోకి ప్రవహిస్తోంది. కొన్ని సమయాల్లో కాలువ ద్వారా నీరు వృథాగా పోతోంది.

లిటిల్ మాస్టర్ డైవర్

నీరంటే పిచ్చి... స్కూబా డైవింగ్ అంటే ఆసక్తి. అవే కైనా ఖరేకి ప్రపంచంలోనే అత్యంత పిన్నవయస్కురాలైన మాస్టర్ స్కూబా డైవర్‌గా గుర్తింపు తెచ్చిపెట్టాయి. సాహసాలకు వయసుతో పని లేదంటున్న ఈ పన్నెండేళ్ళ బెంగళూరు అమ్మాయి కథేమిటంటే...



"నీటి అడుగున నాకు ఎన్నో అనుభవాలు ఎదురయ్యాయి. చెప్పడానికి అనేక విశేషాలున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీదు. వాతావరణం భయానకంగా ఉంటుంది, ఒక్కోసారి ఏదీ కనిపించదు. మనతో కలిసి డైవ్ చేసినవారు కనిపించకుండా పోవచ్చు. వాళ్ళకోసం వెతుకుతూ ఉండాలి. కొన్నిసార్లు చేపలు దాడి చేస్తాయి. "ఇంత రిస్క్ తీసుకొని, ఈ చిన్న వయసులో ఎందుకీ సాహసాలు?" అని ఎందరో అడుగుతూ ఉంటారు. "ఎందుకంటే... నీళ్ళంటే నాకు పిచ్చి. డైవింగ్ అంటే ఎనలేని ఆసక్తి. ఇక రిస్క్ అంటారా... రోడ్డు మీద నడిచి వెళ్తున్నప్పుడు కూడా ప్రమాదం జరగొచ్చు. అందరూ అన్ని వేళలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి" అని చెబుతుంది కైనా ఖరే. ఇటీవలే అండమాన్-నికోబార్‌లో 'మాస్టర్ స్కూబా డైవర్ సర్టిఫికేషన్ అందుకొని, అధికారికంగా 'మాస్టర్ డైవర్'గా గుర్తింపు పొందిన ఈ పన్నెండేళ్ళ అమ్మాయి స్వస్థలం బెంగళూరు. రెండేళ్ళ వయసులోనే కైనాకు ఆమె తల్లితండ్రులు స్విమ్మింగ్‌ను పరిచయం చేశారు. "కైనాను అందరూ 'వాటర్ బేబీ' అని పిలిచేవారు. మా అపార్ట్‌మెంట్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతను ఆమెకు పరిచయం చేశాం. అందులో మంచి ప్రావీణ్యం సంపాదించింది. రెండేళ్ళ కిందట... తనకు పదేళ్ళ వయసులో... మా కుటుంబం అండమాన్-నికోబార్ దీవుల పర్యటనకు వెళ్ళినప్పుడు... స్కూబా డైవింగ్ పరిచయం అయింది. అప్పటి నుంచీ ఆమెకు అదే లోకంగా మారిపోయింది" అని చెప్పారు కైనా తల్లి అన్షుమ.



స్విమ్మింగ్ పూల్‌లో కాకుండా... సముద్రం జలాల్లో డైవ్ చెయ్యడం కాస్త భయంగానూ, సరదాగానూ అనిపించింది. స్కూబా డైవింగ్‌లో మరింత నైపుణ్యం కోసం ఇండోనేసియాలోని బాలిలో 'ఓపెన్ వాటర్ కోర్స్' చేశాను. అలాగే థాయిలాండ్‌లో 'అడ్వాన్స్‌డ్ ఓపెన్ వాటర్ కోర్స్ పూర్తి చేసి, సర్టిఫికెట్ అందుకున్నాను" అని చెబుతున్న కైనా అండర్‌వాటర్ ఫొటోగ్రఫీ, స్పెషలైజ్డ్ నిట్రోక్స్ డైవింగ్, రెస్క్యూ డైవర్ ట్రైనింగ్... ఇలా అనేక అంశాల్లో శిక్షణ పొందింది. "ఇవేవీ సాధారణమైన అంశాలు కావు. కేవలం రెండేళ్ళలోనే వాటన్నిటిలో కైనా నిష్ణాతురాలై... అనుభవజ్ఞులైన స్కూబా డైవర్లను ఆశ్చర్యపరచింది. స్కూబా డైవింగ్‌లో కోర్సులు చేస్తానని కైనా చెప్పినప్పుడు... మొదట్లో మేము సంకోచించాం. కానీ ఆమె పట్టుదలను చూసి... ప్రోత్సహించాం" అంటారు అన్షుమ.

సవాళ్ళకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి

స్కూబా డైవింగ్‌కు ఎంతో ధైర్యం, సమయస్ఫూర్తి కావాలి. భద్రతా ప్రోటోకాల్స్ కచ్చితంగా పాటించాలి. దానికి అనుగుణంగా కైమా తల్లితండ్రులు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు. "నేను అండమాన్-నికోబార్ దీవులతో పాటు బాలి, మాల్దీవులు, థాయిలాండ్... ఇలా ఎన్నో ప్రాంతాల్లో డైవింగ్ చేశాను. ప్రతి ప్రదేశానికీ తనదైన విశిష్టత ఉంది. నీటి అడుగున ఉండే పర్యావరణ వ్యవస్థలన్నా, జీవులన్నా నాకు చాలా ఇష్టం. అన్నిటిన్నా సముద్రపు తాబేళ్ళు నాకు ఫేవరెట్. అవి భారీగా, అద్భుతంగా ఉంటాయి" అని అంటోంది కైనా. స్కూబా డైవింగ్‌లో ఆమె ప్రతిభ... అధికారికంగా 'మాస్టర్ డైవర్ టైటిల్' అందుకొనేలా చేసింది. అసాధారణమైన పరిజ్ఞానం, అంకితభావం, నైపుణ్యం ఉన్నవారికి ఈ టైటిల్ ఇస్తారు. తద్వారా 'ప్రపంచంలో తక్కువ వయసున్న మహిళా మాస్టర్ స్కూబా డైవర్'గా గుర్తింపును సైతం కైనా సొంతం చేసుకుంది. "సముద్రంలో ఎలాంటి సవాల్‌నైనా ఎదుర్కోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ప్రత్యేకించి అండమాన్-నికోబార్ దీవుల్లో వాతావరణం భయపెడుతుంది. వర్షాలు, తుపాన్లు హఠాత్తుగా ముంచుకొస్తాయి. అలాంటి వాతావరణంలో ఒకసారి ఒక డైవర్ నీళ్ళలోకి దూకి అపస్మారక స్థితికి చేరాడు. నేను అతన్ని బోట్ వరకూ ఈడ్చుకువచ్చాను. ఆ సంఘటన ఇప్పటికీ గుర్తొస్తూ ఉంటుంది" అంటున్న కైనా "మెరైన్ సైన్స్ చదవాలనేది నా కోరిక. ప్రపంచంలో వీలైన ప్రతిచోటా స్కూబా డైవింగ్ చెయ్యాలన్నది నా కల" అని చెబుతోంది.



సెలబ్ షెట్

వరుస సినిమాలు లేవు. కానీ కెమెరా లెన్స్‌లు ఎప్పుడూ ఆమెపై ఎక్కుపెట్టే ఉంటాయి. టీవీ షోలకు గెస్ట్‌గా... హోస్ట్‌గా... అన్నిటికీ మించి ఫిట్‌నెస్ గురూగా... భిన్న పాత్రల్లో ఒదిగిపోయిన బాలీవుడ్ నటి **శిల్పాశెట్టి**. 'నా మది నియంత్రణలో నేను లేను. నా ఆధీనంలో నా మనస్సు ఉంటుంది. ఇదే నా ఆనందమయ జీవనానికి కారణం' అంటున్న శిల్ప... యాభై ఏళ్ల వయసులోనూ తరగని అందం... మైమరిపించే రూపంతో ఆకట్టుకుంటోంది.

శిల్ప సౌందర్యం



"ఎంత పని ఒత్తిడి ఉన్నా, ఎన్ని సమస్యలు చుట్టుముట్టినా, నన్ను మానసికంగా ఇంత దృఢంగా ఉంచుతున్నది భగవద్గీతలోని 'బంధురాత్మనస్తస్య యేనాత్మైవాత్మాన జితః... అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్' శ్లోకం. 'ఎవరైతే తమ మనస్సును జయిస్తారో అది వారికి మంచి మిత్రుడిగా ఉంటుంది. లేదంటే అదే వారికి శత్రువు అవుతుంది' అని దీని అర్థం. నా మనసు నా నియంత్రణలో ఉందని, దాని ఆధీనంలో నేను లేనని గుర్తు చేసుకోవడానికి రోజూ ఈ శ్లోకాన్ని బిగ్గరగా చదువుతా" అంటున్న శిల్ప క్రమం తప్పకుండా యోగా చేస్తుంది. క్లిష్టమైన యోగాసనాలతో కొన్ని వీడియోలు కూడా ఆమె విడుదల చేసింది. 'అలాగే శ్వాసకు, మానసిక ఆరోగ్యానికి సంబంధం ఉంది. ప్రతి భావోద్వేగం శ్వాసతో ముడిపడి ఉంటుంది. ఒకవేళ మీరు శ్వాస లయను మార్చగలిగితే భావోద్వేగాన్ని కూడా మార్చవచ్చు' అంటుందీ బ్యూటీ.

'యోగా ప్రకారం శ్వాసకు, మానసిక ఆరోగ్యానికి అనివార్యమైన సంబంధం ఉంది. ఎందుకంటే ఒక వ్యక్తి శ్వాస అతడి మానసిక స్థితిని ప్రతిబింబిస్తుంది. శ్వాస మీద నియంత్రణ గలవారు ప్రశాంత చిత్తంతో ఉండగలరు. ప్రాణాయామం లాంటి శ్వాస సంబంధిత ప్రక్రియలు ఒత్తిడిని తగ్గించి, భావోద్వేగాల సమతుల్యతకు దోహదపడతాయి. అదేవిధంగా పలు యోగాసనాల భంగిమలు కూడా శ్వాసతో ముడిపడినవే. గురువుల పర్యవేక్షణలో సాధన చేస్తే ఆనందమయమైన, ఆరోగ్యకరమైన జీవన శైలిని పొందగలుగుతారు'... అనేది శిల్ప మాట. యోగాను దైనందిన జీవితంలో భాగం చేయాలనుకొనేవారు... 'తొలుత సులువైన ఆసనాలతో ప్రారంభించి, క్రమంగా శరీరానికి అవసరమైనవాటిని సాధన చేస్తూ పోవాలి. వ్యాయామాలను ఏదో తప్పనిసరిగా చేస్తున్నట్టు కాకుండా... వాటిని ఆస్వాదిస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయి. వీటన్నిటితో పాటు పరిశుభ్రమైన సమతుల ఆహారం, జీవన శైలి కూడా ఎంతో ముఖ్యం. అప్పుడే మన శరీరం సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకొంటుంది' అంటోందీ భామ.

వర్కవుట్ ఇలా...

ఇటీవల శిల్పాశెట్టి ఇన్‌స్టాలో ఫిట్‌నెస్‌కు సంబంధించి ఒక రీల్ పోస్టు చేసింది. అందులో సులువైనదీ, ఇంట్లోనే చేసుకోదగినవి, ప్రభావవంతమైనవి, అద్భుతమైన ఫలితాలను ఇచ్చే ప్లాంక్స్ చేసి చూపించింది. వాటిల్లో ఆర్మ్ ప్లాంక్, సైడ్ ఎల్బో ప్లాంక్, ఎల్బో ప్లాంక్ ఉన్నాయి. రోజుకు 15-20 చొప్పున మూడు సెట్లు చేస్తే చేతులు, భుజాలు, నడుము దగ్గర కండరాలు బలపడతాయని, ఇవి కేవలం ఇరవై నిమిషాల్లో ముగించగల వ్యాయామాలని చెప్పింది శిల్ప. అలాగే సేతు బంధాసన, విశుద్ధి చక్ర, అర్ధహలాసన, నవాసనాలను రోజువారీ యోగా సాధనలో చేర్చుకొంటే అద్భుత ఫలితాలు ఉంటాయంటోంది.

- శిల్పాశెట్టి వర్కవుట్స్ యోగా, కార్డియో, వెయిట్స్ కాంబినేషన్‌తో ఉంటాయి. శరీరాన్ని దృఢంగా, అపురూపంగా తీర్చిదిద్దుకోవడానికి ఆమె తన శరీరానికి సరిపడే కొన్ని వ్యాయామాలతో ఫిట్‌నెస్ మెనూ రూపొందించుకుంది.
- రోజూ ఉదయం ముప్ఫై నుంచి నలభై నిమిషాలపాటు యోగా
- తరువాత రన్నింగ్, జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్‌తో కూడిన కార్డియో
- బిగువైన, బలమైన కండరాల కోసం వెయిట్‌లిఫ్టింగ్, స్క్వాట్స్, లంగెస్, పుషప్స్

ఇదీ మెనూ...

బిడ్డకు జన్మనిచ్చిన తరువాత కూడా శిల్పాశెట్టి శరీరాకృతిలో ఎలాంటి మార్పు రాలేదు. అందుకు ఆమె పాటించే వ్యాయామ, ఆహార నియమాలే ప్రధాన కారణం. మొదలుపెట్టి వదిలేసేవాళ్లే ఎక్కువగా కనిపిస్తుంటారు. అలాంటివారికి భిన్నం శిల్ప. క్రమశిక్షణకు ఆమె అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఆమె మెనూలో పోషకాలు నిండిన సమతుల ఆహారం ఉంటుంది. జీవక్రియ చురుగ్గా ఉండటానికి ఒకేసారి కాకుండా చిన్న చిన్న విరామాల్లో కొద్ది మొత్తంలో తీసుకొంటుంది. తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు మెనూలో ఉంటాయి. ప్రాసెస్‌డ్, జంక్ ఫుడ్, కూల్‌డ్రింక్స్, ఇతర డ్రింక్స్‌కు పూర్తిగా దూరం. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడానికి తరచూ మంచినీళ్లు తాగుతుంది.

- ఉదయం 15 ఎంఎల్ అలోవెరా జ్యూస్, పది తులసి ఆకులు, బెల్లం, అల్లం జ్యూస్. తరువాత రెండు గ్లాసుల గోరువెచ్చటి నీళ్లు.
- ఉదయం 8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్‌లో మూడొంతుల నీళ్ల, ఒక వంతు పాలలో ఉడకబెట్టిన ఓట్స్/ మరగబెట్టిన పాలతో ముస్లీ/ వీట్ బ్రెడ్ టోస్ట్‌తో రెండు ఉడకబెట్టిన గుడ్లు, నానబెట్టిన బాదం.
- ఉదయం 9 గంటలకు బ్రౌన్ షుగర్‌తో టీ. గంట తరువాత బొప్పాయి, కర్బూజా, స్ట్రాబెర్రీ, నారింజ, ఐదు టేబుల్ స్పూన్ల యోగర్ట్ కలిపి ఒక బౌల్ నిండా ఫ్రూట్ సలాడ్.
- మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనంలో చికెన్/ గ్రిల్డ్ ఫిష్, ఉడకబెట్టిన కాయగూరలు, నెయ్యితో బ్రౌన్ రైస్. లేదంటే ఉడకబెట్టిన బీన్స్, ఒక పచ్చి క్యారెట్, రోస్టెడ్ జీరాతో గ్లాసు ఉప్పు వేసిన మజ్జిగ.
- సాయంత్ర స్నాక్స్‌లో వెరైటీలు మారుతుంటాయి. పది రోస్టెడ్ మఖానా, ఐదు అక్రోట్స్, కిస్మిస్.
- రాత్రి ఏడున్నరకు మిక్స్‌డ్ వెజిటబుల్/ చికెన్ సూప్‌తో పాటు టమాటో, మొలకలు, యాపిల్, చాట్ మసాల కలిపిన పాలకూర.
- డిన్నర్‌లో గ్రిల్డ్, ఫ్రైడ్ చికెన్‌తో ఉడకబెట్టిన కూరగాయలు. లేదంటే బీన్స్/ బ్రకోలీతో ఉడకబెట్టిన ఫిష్, ఒక క్యారెట్.

కురుల ఆరోగ్యానికి.. అలోవెరా!

న్యూట్రిన్లు, విటమిన్లు, అమినో ఆమ్లాలుండే అలోవెరా చర్మానికే కాదు జుట్టు ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఇంట్లోని పెరటిలో ఉండాల్సిన మొక్క ఇది. ఇంతకీ అలోవెరాతో హెయిర్ ప్యాక్స్ చేసుకోవటమెలా?

- అలోవెరా జెల్‌ను తలకు పట్టించుకుంటే.. జుట్టు రాలటం ఆగిపోతుంది. ముఖ్యంగా తలలో దురదలు తగ్గిపోతాయి.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి చూర్ణంలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి ఆరిన తర్వాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే చుండ్రు తగ్గిపోతుంది. మాడు చల్లగా, ఆరోగ్యంగా ఉంటుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండున్నర స్పూన్ల కొబ్బరినూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే.. హెయిర్ డ్యామేజ్ కావటం ఆగిపోతుంది.
- రెండున్నర టేబుల్ స్పూన్లు అలోవెరా జెల్‌కు.. రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం వేయాలి. మిశ్రమాన్ని బాగా కలిపి జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత శుభ్రంగా కడిగేయాలి. ఇలా పలుసార్లు చేస్తుంటే.. చుండ్రు పోతుంది. జుట్టు మిలమిలా మెరుస్తుంది.
- రెండు టేబుల్ స్పూన్ల మెంతుల్ని రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. హెయిర్ ప్యాక్ కోసం బౌల్‌లో మూడు స్పూన్ల అలోవెరా జెల్ తీసుకుని.. ఇందులోకి మెంతుల పేస్ట్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి ఇరవై నిముషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే జుట్టు పెరుగుతుంది.
- బౌల్‌లో అరకప్పు అలోవెరా జెల్ తీసుకుని.. ఇందులోకి రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, ఒక కోడిగుడ్డు వేసి స్పూన్‌తో మెత్తటి పేస్ట్‌లో చేయాలి. దీన్ని జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. దీని వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.



నవ్య | చిత్రజ్యోతి

ఎవడికోసం తగ్గాలి



వైవిధ్యమైన చిత్రాలు, పాత్రలతో కథానాయకుడిగా ప్రేక్షకుల ముందుకొస్తున్నారు అల్లరి నరేశ్. ఆయన నటిస్తున్న 'బచ్చల మల్లి' చిత్రం గ్లింప్స్‌ను యూనిట్ ఆదివారం విడుదల చేసింది. ఈ వీడియోలో అల్లరి నరేశ్ పాత్రను మేకర్స్ పరిచయం చేశారు. 'ఏయ్ ఎవడికోసం తగ్గాలి, ఎందుకోసం తగ్గాలి' అంటూ ఆవేశంగా ఆయన పలికిన సంభాషణలు, పోరాట ఘట్టాల్లో ప్రదర్శించిన నటన ఆకట్టుకుంది. అమృత అయ్యర్ ఈ చిత్రంలో కథానాయిక. సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తున్నారు. రోహిణి, రావు రమేశ్, బలగం జయరాం, వైవా హర్ష కీలకపాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

అల్లరి నరేశ్‌తో సితార చిత్రం

అల్లరి నరేశ్ హీరోగా ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం కొత్త సినిమాను ప్రకటించింది. 'మీరు అతని కంటి నుంచి తప్పించుకోలేరు' అంటూ పోస్టర్‌ను విడుదల చేసి, సినిమాపై ఆసక్తిని పెంచింది. 'ఫ్యామిలీ డ్రామా' చిత్రంతో ప్రశంసలు పొందిన మెహర్‌తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. 'ఏఎన్ 63' అనేది వర్కింగ్ టైటిల్. ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.

సాహసనారి పాత్రలో...



ఆది సాయికుమార్ నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. ఈ డివోషనల్ థ్రిల్లర్‌కు షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తుండగా, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా అవికాగోర్ నటిస్తున్నారు. ఆదివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్రంలో అవికా పోషించే పాత్ర లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు షణ్ముగం సాప్పని మాట్లాడుతూ "ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. ఇందులో అవికా సాహసోతమైన పనులు చేస్తూ, కథానాయకుడి లక్ష్య సాధనకు తోడ్పడే అమ్మాయి పాత్రను పోషిస్తున్నారు. చిత్రీకరణలో ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందించాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తాం" అని చెప్పారు. 'ఇదొక విభిన్న తరహా చిత్రం, కథానాయిక పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రేక్షకులను ఆకట్టుకునే కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం' అని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

నటి వరలక్ష్మీ శరత్‌కుమార్, వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్ పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. రేపు ముంబైలో వీరి వివాహం జరగనుంది. ముందస్తు పెళ్లి వేడుకలకు సంబంధించిన ఫొటోలను వరలక్ష్మి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో అభిమానులతో షేర్ చేసుకున్నారు.



టీమ్ ఇండియా గెలుపుతో భావోద్వేగానికి లోనయ్యా



క్రికెట్‌లో టీమ్ ఇండియా ఆటను నిరంతం సపోర్ట్ చేసే సినీ తారల్లో బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ ఒకరు. శనివారం జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై టీమ్ ఇండియా గెలవడంతో ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. ఆ ఆనందాన్ని ఎక్స్‌లో షేర్ చేసుకున్నారు. "ఎన్నో ఏళ్ల తర్వాత ఓ ఐసీసీ ట్రోఫీని ఇండియా ముద్దాడడంతో నా కళ్ల వెంట ఆనందబాష్పాలు రాలుతున్నాయి. ఈ గెలుపు ఎప్పటికీ ప్రత్యేకమే. భారత్‌ను విశ్వవిజేతగా చూడటం మనందరికీ గర్వకారణం. భారత్ మాతా కీ జై..జై హింద్.." అని పేర్కొన్నారు. కాగా, తాను మ్యాచ్ చూస్తే ఇండియా ఓడిపోతుందని అమితాబచ్ నమ్ముతారు. అందుకే శనివారం జరిగిన ఫైనల్‌ను కూడా చూడలేదని ఆయన చెప్పారు.

మిస్టర్ ఎక్స్ ముగించాడు



ఆర్య, గౌతమ్ కార్తిక్ హీరోలుగా మను ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మిస్టర్ ఎక్స్'. శరత్‌కుమార్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్‌కుమార్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. చివరి రోజు చిత్రీకరణకు సంబంధించిన స్టిల్స్‌ను ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. అజర్ బైజాన్, జార్జియా, ఉగాండా దేశాల్లో పోరాట ఘట్టాలను తెరకెక్కించామని మేకర్స్ తెలిపారు. ధిబు నినాన్ థామస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తన్వీర్ మీర్, ఎడిటింగ్: ప్రసన్న జీకే

కొత్త రోల్ కోసం రంగంలోకి



తనలోని నటికి సవాల్ విసిరే పాత్రల కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు అలియా భట్. గ్లామర్ తారగానే కాదు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటుతున్నారు ఆమె. తాజాగా యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో ఆమె 'రా' ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారు. త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. దీంతో తన పాత్ర కోసం అలియా సన్నాహాలు మొదలు పెట్టారు. జిమ్‌లో భారీ వర్కౌట్ సెషన్స్‌లో పాల్గొంటున్నారు. ఆదివారం కూడా జిమ్‌లో శ్రమిస్తున్నారు. ఈ చిత్రానికి శార్వరీ వాఘ్ దర్శకుడు. అలియా నటించిన జిగ్రా చిత్రం అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 'లవ్ అండ్ వార్' చిత్రంలో నటిస్తున్నారు.

ఘనంగా 'ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం



'కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం ఇటీవలే హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. నందమూరి మోహన్ కృష్ణ, నటుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు మురళీమోహన్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. 'బేబీ' చిత్రానికి గాను ఉత్తమ కథానాయకుడిగా ఆనంద్ దేవరకొండ, దర్శకుడిగా సాయిరాజేశ్ పురస్కారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ పేరిట ఇచ్చే ఈ పురస్కారాలను అందుకున్నందుకు ఆనందంగా ఉంది. ఈసారి ఎన్టీఆర్ ఫిలిం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు నాకు దక్కినందుకు ఆనందంగా ఉంది' అని చెప్పారు. మోహన్ కృష్ణ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ అనే మూడక్షరాలు సంచలనానికి మారుపేరు, ఆయన కొడుగ్గా పుట్టడం ఏదో జన్మలో చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నాను. ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహిస్తున్న కళావేదిక సంస్థకు నా అభినందనలు' అన్నారు. తెలుగు జాతి కోసమే పుట్టి, తెలుగు జాతి ఆత్మగౌరవం కోసమే బతికిన వ్యక్తి తారక రామారావు గారు అని ముఖ్య అతిథిగా పాల్గొన్న నందమూరి మోహన రూప చెప్పారు.

దారుణంగా పారిశ్రామికవాడ రోడ్డు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, కార్మికులు ● పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు



గతుకులుగా మారిన రోడ్డు

(పలాస)

పారిశ్రామికవాడ రోడ్డు దారుణంగా ఉంది. నిత్యం నిత్యం వందలాది లారీలు, రోజు రూ.లక్షల వ్యాపారం సాగించే పారిశ్రామికవాడలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో కనీస సదుపాయాల కల్పన చేపట్టాల్సి ఉన్నా ఆ శాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల నిత్యం అవస్థలు పడాల్సి వస్తోంది. రోడ్ల నిర్వహణ లేకపోవడంతో గోతులమయమై నీరు నిలిచి వాహనదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వేలాది మంది కూలీలు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పాటుగా కాలువలు, తాగునీరు, పార్కులు, కమ్యూనిటీ హాలు, బ్యాంకు నిర్మాణాలు చేప ట్టాల్సి ఉన్నా ఆ దిశగా ఎటువంటి చర్యలు లేవు. ఏడాదికోసారి తనిఖీ చేసి అధికారులు వెళ్లి పోవడమే తప్ప సదుపాయాలను కల్పించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణంతో పాటు ఇతర సదుపాయాలను కల్పించాలని పారిశ్రామిక వేత్తలు, కార్మికులు, పలువురు ప్రజలు కోరుతున్నారు.

నడిచి వెళ్లేందుకు నరకయాతన..

ముంగెన్నపాడు (ఎల్.ఎన్.పేట): ముంగెన్నపాడు గ్రామానికి చెందిన బీటీ రోడ్డు పాడై రాక పోకలకు నరకయాతన పడుతున్నా మని స్థానికులు వాపోతున్నారు. రోడ్డంతా పెద్ద పెద్ద గోతులుగా తయారవడంతో పాటు రాళ్లుతేలి వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అత్యవసర సమయాల్లో అనారోగ్యానికి గురైన బాధితులను చికిత్స కోసం పట్టణాలకు తీసుకెళ్లాలన్నా సాధ్యం కావడం లేదని, గోతులను తప్పించే ప్రయత్నంలో వాహనాలు బోల్తాపడి ప్రమాదాలను గురికావాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆలి కాం-బత్తిలి ప్రధాన రోడ్డుకు అనుసరించి ముంగెన్నపాడు గ్రామం వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఉన్న ఈ మార్గంలో మతలబుపేట, చిన్నమతలబుపేట గ్రామస్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం కురిస్తే రోడ్డు దుస్థితి చెప్పాల్సిన పరిస్థితి లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



రాళ్లు తేలిన ముంగెన్నపాడు రోడ్డు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

జలుమూరు: చల్లవానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి తిమడాం ఫీడర్‌లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా అధిక లోడు ఫీడర్లు విడగొట్టేందుకు తిమడాం ఫీడర్‌లో ఉన్న శ్రీముఖలింగం, అచ్యుతాపురం, కరకవలస, బైదలాపురం, తిమడాం, పర్లాం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

లలితకుమారి సేవలు అభినందనీయం

జలుమూరు: అల్లాడ హెచ్ఎంగా పనిచేసి పదవీ విరమణ చెందిన రఘుపాత్రుని లలితకుమారి సేవలు అభినందనీయమని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు మెండ రామారావు అన్నారు. పాఠశాలలో ఆదివారం పదవీ విరమణ సందర్భంగా లలితకుమారి దంపతులను సత్కరించారు. ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలను అందుకొనేలా చేసిన ఘనత లలితకుమారికి దక్కిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లలిత కుమారి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలోని పలు వీధుల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడడంతో స్థానికుల అభ్యర్థన మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్లతో తాగునీటి సరఫరాను ఆదివారం చేపట్టారు. ముఖ్యంగా పండగలు చేపడుతున్న గొల్లవీధి, చిన్నబజారు, మెట్టవీధి, బ్రాహ్మణవీధి ప్రాంతాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో నీటి సరఫరా చేశారు. నేతలు కోళ్ల లవ కుమార్, కామేసు, మామిడి రాము, ప్రీతీష్, ప్రసాద్‌రెడ్డి, ప్రఫుల్లా, గూన సింహాచలం, లైసెట్టి దుర్గారావు, సోడిమూడి కిరణ్ పాల్గొన్నారు.

ఓంకార్ మృతికి సంతాపం

టెక్కలి: యూటీఎఫ్ నాయకుడు, ప్రజా నాట్య మండలి కళాకారుడు ఓంకార్ మృతికి టెక్కలి మండల యూటీఎఫ్, ప్రజాసంఘాల నేతలు సంతాపం తెలిపారు. ఆదివారం టెక్కలిలో సమావేశమై ఓంకార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు తమ్మినేని వైకుంఠరావు, కె.దాలయ్య, పాలవలస ధర్మారావు, డీపీ స్టాలిన్, సీఐటీయూ నాయకులు షణ్ముఖరావు, పాల్గొన్నారు.

341 మంది విద్యార్థులు.. ఇద్దరు ఉపాధ్యాయులు

● ఆందోళన బాట పట్టిన గెస్టు టీచర్లు

● ఆవేదన వ్యక్తంచేస్తున్న విద్యార్థులు



పెద్దమడి గురుకులం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మెళియాపుట్టి: ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పెద్దమడి గురుకుల పాఠ శాల విద్యార్థులు ఆదివారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాలలో 341 మంది విద్యార్థులుండగా ఇద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులున్నారని దీంతో ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో 17 మంది గెస్ట్ టీచర్లు కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం డీఎస్సీలో జిల్లాలో 542 పోస్టు లున్నట్లు ప్రకటించింది. వీటిలో గిరిజన గురుకులాలను కలిపి ప్రకటించడంతో తాము నష్టపో తున్నామని పేర్కొంటూ గెస్ట్ టీచర్లు శుక్రవారం నుంచి మూకుమ్మడి సెలవులు పెట్టారు. దీంతో తరగతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ అజిత్‌ను వివరణ కోరగా గెస్ట్ టీచర్లు సమస్యల పరిష్కారం కోసం సెలవులు పెట్టారన్నారు. ఉన్న వారితో నడిపి స్తున్నాం. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

అ'పూర్వ' కలయిక



నాటి గురువులతో 1986-87 సంవత్సరం విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి హైస్కూల్‌లో 1986-87 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట చేరి సందడి చేశారు. శివసాగర్ బీచ్‌లో జరిగిన కార్య క్రమంలో పాల్గొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందం పొందారు. నాడు చదువులు చెప్పిన గురువులను సత్కరించి వారి ఆశీర్వాదం పొందారు. దేశ, విదేశాల్లో వివిధ రంగా ల్లో స్థిరపడిన వీరంతా 37 ఏళ్ల తరువాత ఒకచోటకు చేరి కష్టసుఖాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన సహచరులకు సంతాపం తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

వజ్రపుకొత్తూరు: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషణ్, తెలుగుయవత మండల అధ్యక్షుడు మరడ దుర్యోధన రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దాసరి జేజేరావు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛన్ల మొత్తం రూ.1000 పెంచి లబ్ధిదారుల్లో ఆనందం నింపారన్నారు. సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహిస్తామన్నారు. అభివృద్ధికి దూరంగా ఉన్న పలాస నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నారన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్‌గా చల్లా నియామకంపై మంత్రి అచ్చెన్న హర్షం


టెక్కలి: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా తెలుగు వ్యక్తి చల్లా శ్రీనివాసులశెట్టి పేరును ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇనిస్టిట్యూషన్స్ బోర్డు సిఫార్సు చేయడం తెలుగు ప్రజలకు గర్వ కారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయనకు అభినందనలు తెలిపారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి ఎస్‌బీఐ చైర్మన్‌గా నియమితులవడం గర్వంగా ఉందని, బ్యాంకు మరింత అభివృద్ధి చెందెలా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

కూటమి నేతల చిత్రపటాలకు పాలభిషేకం

సంతబొమ్మాళి: కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల మొత్తం పెంచినందుకు హర్షం వ్యక్తంచేస్తూ టీడీపీ నేతలు పాలభిషేకం చేశారు. మరువాడ, మేఘవరం పంచాయతీల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు చిత్రపటాలకు పాలతో అభిషేకించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, తెలుగుయువత జిల్లా కార్యదర్శి సూరాడ దాసురాజు, పరపటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూడివానిపేట(పోలాకి): పూడివానిపేట రామమందిరం ప్రథమ వార్షికోత్సవం ఆది వారం నిర్వహించారు. వేదపండితులు శృంగారం లక్ష్మీ ధనుంజయ శర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్వామిని దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేద పండితులు ఘన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలిచ్చి ఆశీర్వదించారు. రామ మందిరం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బ్రాహ్మణులకు కూట మి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని సత్కరిస్తున్న గ్రామస్థులు

పవన్ కల్యాణ్ కృషితో కూటమి విజయం

పలాస: రాష్ట్రంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కృషితో కూటమి విజయం సాధించిందని ఆ పార్టీ నాయకులు అన్నారు. స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం పలాస జనసేన నాయకులు విజయోత్సవ సభ నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు అట్టాడ వాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నేత, ప్రముఖ వైద్యుడు దానేటి శ్రీధర్ మాట్లాడుతూ.. కూటమి బలంతో గెలుపొందిన కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారని, పలాసలో శిరీష మంచి మెజార్టీ సాధించారని గుర్తు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇదే స్ఫూర్తితో కూటమి విజయం సాధిస్తుందనే దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బడ్డ నాగరాజు, టంకాల రవిశంకర్ గుప్తా, సప్ప నవీన్, ఎ.రామకృష్ణ, డొక్కరి శంకర్, జోగ మల్లి, జనసేన నాయకులు దివ, కేదార్, మోహ న్, అశోక్, రాము పాల్గొన్నారు.



విజయోత్సవ సభలో పాల్గొన్న జనసేన-టీడీపీ నాయకులు

ప్రతి ఎకరాకు సాగునీరందించండి

● నేడు ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల

● నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు

● మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు

నరసన్నపేట, జూన్ 30: ప్రతి ఎకరాకు సాగునీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మో హన్నాయుడు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వంశధార, డీఆర్‌డీఏ, డ్వామా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్‌లో శివారు భూములకు కూడా నీరందించేలా అధికారులు సమాయత్తం కావాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోమవారం ఉదయం 6 గంటలకు వంశధార ఎడమ కాలువ ద్వారా సాగునీరు వెడిచి పెట్టాలని, ఎక్కడైనా ఇబ్బందులుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

సోమవారం ప్రారంభించనున్న పింఛన్ల పంపిణీని పండగ వాతావరణంలో లబ్ధిదారులకు అందించాలని, ప్రతి ఇంటికి సచివాలయాల ఉద్యోగులు స్థానిక నాయకుల సమన్వయంతో వెళ్లి పంపిణీ చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి సందేశం లేఖలను అందజేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నరసన్నపేట, పలాస, శ్రీకాకుళం, పాతపట్నం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, గొండు శంకర్, మామిడి గోవిందరావు, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, వంశధార ఎస్ఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో కేంద్ర మంత్రి రామ్మోహన్, ఎమ్మెల్యేలు, కలెక్టర్

ఎన్నికల హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారు

హిరమండలం: కూటమి ప్రభుత్వం తొలిసారి చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పెంచిన పింఛన్ల మొత్తం పంపిణీ కార్యక్రమం పండగ వాతావరణంలో చేపట్టాలని జడ్పీటీసీ పి.బుచ్చి బాబు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చార న్నారు. టీడీపీ కార్యకర్తలు ఈ సంబరాల్లో పాల్గొనాలన్నారు. గులుమూరు, హిరమండలం-2 సచివాలయాల పరిధిలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పింఛన్ల పంపిణీ చేపడుతారన్నారు.



మాట్లాడుతున్న జడ్పీటీసీ బుచ్చిబాబు

సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

నందిగాం: మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో టి. రాజారావు తెలిపారు. సోమ వారం 37 పంచాయతీల్లో 9,865 మంది లబ్ధిదారులకు అందించనున్నామన్నారు. ఈ మేరకు ఆదివారం తన కార్యాలయంలో పింఛన్ల పంపిణీకి సంబంధించి సీఎం చంద్రబాబునాయుడు సందేశంతో రూపొందించిన కరపత్రాలను పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందికి పంపిణీ చేశారు. సోమవారం ఉదయం 6 గంటలకే లబ్ధిదారులకు పెన్షన్లతో పాటు సీఎం సందేశం లేఖలను అందించాలన్నారు. మరోవైపు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు గ్రామాల్లో పండగ నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో పెన్షన్ల పంపిణీలో భాగంగా సీఎం చిత్రపటాలకు పాలభిషేకం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.



సీఎం సందేశం కరపత్రాలను కార్యదర్శులకు అందజేస్తున్న ఎంపీడీవో రాజారావు

● **పోలాకి:** పోలాకి మండలంలోని 23 సచివాలయాల పరిధిలో సోమవారం కూటమి ప్రభు త్వం ప్రకటించిన పెంపు పింఛన్లను లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీ డీవో కె.ఉషశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. పెంచిన మొత్తం రూ.1000తో కలిసి మూడు నెలల బకాయితో కలిపి రూ.7 వేలు అందించనున్నామన్నారు. సచివాలయ ఉద్యోగులతో ఉదయం 6 గంటలకు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వీటిని అం దించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని వర్గాల పింఛన్లు 10175 మంది లబ్ధిదారులకు రూ.66,75,7500 నగదు విడుదల చేసినట్లు చెప్పారు. పింఛన్ల పంపిణీని పండగ వాతావరణంలో చేపట్టాలని, ప్రజాప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ ప్రతినిధులకు ఆహ్వానించాలన్నారు.

● **పలాసరూరల్:** మండలంలో సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ను లబ్ధిదారుల ఇంటి వద్దే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో మెట్ట వైకుంఠ రావు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం పెన్షన్‌దారులకు ఇబ్బందులు లేకుండా పంపిణీకి సిద్ధం చేశామన్నారు. బ్రాహ్మణతర్లాలో ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో పెంపు పింఛన్లు అందజేయనున్నామన్నారు.

● **మందస:** నూతన ప్రభుత్వం పెంచిన సామాజిక పింఛన్లను సోమవారం అందజేయనున్నట్లు మాజీ సర్పంచ్ డొంకురు తిరుపతిరావు తెలిపారు. మందసలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పెంచిన రూ.1000తో పాటు గత మూడు నెలల బకాయిలు రూ.3 వేలు కలిపి రూ.7 వేలు అందించడం జరుగుతుందన్నారు. సోమవారం సెగిడివీధిలో ఎమ్మెల్యే గౌతు శిరీష పింఛన్లను పంపిణీ చేయనున్నామన్నారు. కార్యక్రమంలో గార కృష్ణారావు, రాజాన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** ఎన్డీఏ ప్రభుత్వం పెంచిన పింఛన్ మొత్తాన్ని కలిపి బకాయిలను సోమవారం చినవంక, గుణుపల్లి పంచాయతీల్లో ఎమ్మెల్యే గౌతు శిరీష పంపిణీ చేస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఆదివాసీల ఐక్యతతోనే హక్కుల రక్షణ

హరిపురం: ఆదివాసీల ఐక్యతతోనే హక్కుల రక్షణ కలుగుతుందని ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ అన్నారు. కొండలోగాంలో సవర చిలకమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. అఖిలభారత ఆదివాసీ వేదిక జిల్లా నాయకులు ఎస్.పున్నయ్య, ఎస్.రాజారావు, ఎస్.దశరథ, ఎస్.మోహనరావు, గొరకల బాలకృష్ణ తదితరులు మాట్లాడుతూ.. 168 ఏళ్ల ఆదివాసీల చారిత్రాత్మక తిరుగుబాటును ఈ సందర్భంగా గుర్తుచేసు కున్నారు. జూన్ 30న సంతాల్ ఆదివాసీల తిరుగుబాటు స్ఫూర్తితో ఆదివాసీ భాష, సంస్కృతి, హక్కుల రక్షణకై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గిరిజన యువత, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోహర్లు అర్పిస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

రేపు పెంట పోలమ్మ చల్లదనం

పలాసరూరల్: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 11వ వార్డులో ఈనెల 2వ తేదీన పెంట పోలమ్మ అమ్మవారి చల్లదనం నిర్వహిస్తున్నట్లు మాజీ కౌన్సిలరు, జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్ త్యాడి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై పెంట పోలమ్మ చల్లదనం విజయవంతం చేయాలని కోరారు.

రేపు కిల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభం

మందస: సాబకోట సమీపంలోని డింబిరిగాం గ్రామంలో ఈనెల 2, 3 తేదీల్లో కిల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 2న ఉదయం అంకురార్పణ, 3న సాధువంశీధర దాస్ మహారాజ్‌చే ప్రవ చనం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పూర్ణాహుతి తదితర కార్యక్రమాలుంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

'పీస' మృతికి సంతాపం

జలుమూరు: చిన్నదూగాం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పీస శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటని మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతూ శ్రీనివాసరావు మృతిచెందారు. ఆదివారం మృత దేహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతుడి భార్య పద్మావతి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా, అన్నయ్య రామారావు సర్పంచ్‌గా రెండు పర్యాయాలు పనిచేశారు. శ్రీనివాసరావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. టీడీపీ నాయకులు కింజరాపు హరిప్రసాద్, వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, గుండ రామకృష్ణ సంతాపం వ్యక్తంచేశారు.



పీస శ్రీనివాసరావు (ఫైల్)

7న బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం

టెక్కలి: టెక్కలి నియోజకవర్గ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రీజనల్ కార్యదర్శి రాజేష్ తెలిపారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొనాలని కోరారు.

మండలంలో మోస్తరు వర్షం

నందిగాం: మండలంలో అల్పపీడన ప్రభావంతో ఆదివారం మధ్యాహ్నం ఒక మోస్తరు వర్షం పడింది. దీంతో పలు ప్రాంతాల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవల వర్షాలు కొన్ని గ్రామాలకే పరిమితమవుతుండడంతో రైతులు నిరుత్సాహానికి గురయ్యారు. ఆదివారం పడిన వర్షం రైతులకు ఊరట నిచ్చింది.



నందిగాంలో పడుతున్న వర్షం

యువకుడి దారుణహత్య

- ఒడిసా రాష్ట్రం సున్నాపురం బీచ్‌లో కొంతమందితో ఘర్షణ
- దారికాసి కత్తులతో దాడి
- మృతుడిది కేదారిపురం గ్రామం


ఘటనా స్థలంలో బాలు మృతదేహం

ఇచ్ఛాపురం: ఒడిసా రాష్ట్రం సున్నాపురం బీచ్ సమీపంలో ఇచ్ఛాపురం మండలం కేదారిపురం గ్రామానికి చెందిన యువకుడు ఆశి బాలు(27) దారుణహత్యకు గురయ్యాడు. ఒడిసా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం తన స్నేహితులతో కలిసి సున్నాపురం బీచ్‌కు వెళ్లాడు. అంతా సాయంత్రం వరకు సరదాగా గడిపారు. సాయంత్రం సమయంలో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన కొంతమంది యువకులతో ఘర్షణ పడ్డారు. తర్వాత ఏమి జరిగిందో తెలియదు గాని ఆరు గంటల సమయంలో బీచ్ నుంచి వస్తుండగా దారి కాసి ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు కత్తులతో దాడి చేసి హత్య చేశారు. విషయం తెలుసుకున్న ఒడిశా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం బరంపురం ఆసుపత్రికి తరలించారు. బాలుకి సావిత్రి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఒడిసా పోలీసులు తెలిపారు.

ఆదిలాబాద్‌లో జిల్లా వాసి మృతి

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళంకు చెందిన బాలకృష్ణ మృతి చెందాడు. పొట్టకూటి కోసం మహారాష్ట్రలోని కిన్వట్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న శ్రీకాకుళం వాసి బాలకృష్ణ ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చందా(టీ) గ్రామంలో ఉన్న తమకు తెలిసిన వారి ఇంటికి వెళ్లాడు. అయితే తిరిగి ఆదివారం కిన్వట్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరగా, చందా బైపాస్ వద్ద బోర్డుకు ఢీకొని కిందపడడంతో తలకు తీవ్రగాయలై మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

టెక్కలి: కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు సమీపంలో హైవేపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. టెక్కలి మండలం దామోదరపురానికి చెందిన పురట తాతారావు (40) ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్తుండగా కోళ్ల వ్యాన్ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కోట బొమ్మాళి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు మహిళ..

టెక్కలి: తొలుసూరుపల్లికి చెందిన దివ్యాంగురాలు గూన సరోజిని (45) తన ఇంటి వరండా లో నిద్రిస్తుండగా శనివారం రాత్రి పాముకాటుకు గురైంది. వెంటనే ఆమె కుటుంబ సభ్యులకు తెలపడంతో హుటాహుటిన జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

చెరువులో జారిపడి వివాహిత..

జి.సిగడాం: గెడ్డకంచరాం గ్రామానికి చెందిన వివాహిత కుంచాల పోలమ్మ (26) ప్రమాద వశాత్తు చెరువులో జారి పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం మండలం సింగివలస గ్రామానికి చెందిన సంతోష్ కుమార్‌తో పోలమ్మకి వివాహం జరిగింది. వీరిద్దరు కలిసి పోలమ్మ కన్నవారి గ్రామమైన గెడ్డకంచరాం వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం వేకువజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ సమీపంలో గల ఊర చెరువుకు వెళ్లింది. దీంతో పోలమ్మ ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందింది. చేపల వేటకు అటుగా కొందరు మత్స్యకారులకు చెరువులో తేలియాడిన పోలమ్మ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలమ్మకు ఐదేళ్ల కుమార్తె శ్రావంతి ఉంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. పోలమ్మ తల్లి ఉప్పాడ పైడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఆదిత్యుని సన్నిధిలో సినీ గాయకుడు మనో


మనో దంపతులకు స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న శంకరశర్మ

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని సుప్రసిద్ధ సినీ నేపథ్య గాయకుడు మనో ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ప్రధాన అర్చకులు వారికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి, గుత్తు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దశలవారీగా పోరాటం


మాట్లాడుతున్న యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి

అరసవల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటాలకు సిద్ధం కావాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు బి.ఉత్తర, కె.సుశీల పిలుపునిచ్చారు. నగరంలోని ఇందిరానగర్ కాలనీలో గల సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. 23 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులుగా గుర్తించలేదని, కనీస వేతనాలు అమలు చేయడం లేదని, ఇది దుర్మార్గమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచకుండా ఆర్థిక దోపిడీకి పాల్పడడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.10వేలు అమలు చేయాలని, ప్రతీ నెలా 5వ తేదీ లోగా వేతనాలు, బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని, హైస్కూల్‌లో పనిచేస్తున్న వారికి వేతనం ఇవ్వాలని, సెలవులు, మెటర్నిటీ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.సీతమ్మ, ఎం.రాము., జి.దమయంతి, వై.తులసి, కె.కౌసల్య, కె.మహేశ్వరి, ఎం.ఆదిలక్ష్మి, కె.ఉమ, మంగమ్మ, ఆదిలక్ష్మి, ఉత్తర, నాగరత్నం, ఎం.కుమారి, కళావతి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక ఏకపాత్రాభినయ పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: ఉత్తరాంధ్ర స్థాయి పౌరాణిక ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షులు చిట్టి వెంకటరావు తెలిపారు. ఈ పోటీలకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 చెల్లించాలన్నారు. ఈ నెల 10వ తేదీలోపు 94403 47848 ఫోన్ నెంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణ బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బంటుపల్లి రామచంద్రదేవ్, పొట్నూరు వెంకటరావు, కలగ గణేష్ యాద్, కాంచరాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌ను అభివృద్ధి చేయరూ!

- ఆహ్లాదానికి అనువైనది తీరం పాతదిబ్బలపాలెం
- సౌకర్యాలు లేక వెలవెల


పాతదిబ్బలపాలెం బీచ్

ఎచ్చెర్ల: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నగరానికి సమీపంలో గల సముద్రతీరం అభివృద్ధి కోసం ఎదురుచూస్తోంది. ఒకప్పుడు ఆ బీచ్‌ను ఆనుకొని ఉన్న ఆ గ్రామం వేలాది మందితో కళకళలాడేది. నేడు పదుల సంఖ్యలో మాత్రమే జనం ఉన్న ఆ గ్రామాన్ని ఆనుకొని ఉన్న బీచ్‌ను అభివృద్ధి చేయాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం బీచ్‌ను అభివృద్ధి చేస్తే ఎంతో అనువుగా ఉంటుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు.

నగరానికి సమీపంలోనే..

శ్రీకాకుళం నగరానికి సుమారు 10 కిలో మీటర్ల దూరంలో బొంతలకోడూరు పంచాయతీ పరిధిలో పాతదిబ్బలపాలెం బీచ్ ఉంది. పొన్నాడ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో నగర ప్రజలు ఈ బీచ్‌కు వెళ్లేందుకు మరింత సౌకర్యంగా ఏర్పడింది. పొన్నాడ జంక్షన్ నుంచి బొంతలకోడూరు వరకు పక్కా రోడ్డు నిర్మాణ పనులు ఏడాదిన్నర కిందటే పూర్తయ్యాయి. దీంతో బీచ్‌కు వెళ్లేందుకు మరింత సౌకర్యం ఏర్పడింది. ఇప్పటికే రెండు, మూడు సార్లు పర్యాటక శాఖాధికారులు పాత దిబ్బపాలెం బీచ్‌ను పరిశీలించారు. ఈ బీచ్‌ను అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనను స్థానికులు తీసుకొచ్చారు.

సౌకర్యాలు కల్పించాలి



పాత దిబ్బలపాలెం బీచ్‌లో సౌకర్యాలు కల్పించి, అభివృద్ధి చేస్తే పరిసర గ్రామాల ప్రజలతో పాటు, శ్రీకాకుళం నగరవాసులకు కూడా అందుబాటులోకి వస్తుంది. ప్రజలు సేద తీరేందుకు, ఆనందంగా గడిపేందుకు వీలుంటుంది. బీచ్‌ను ఆనుకొని పార్క్, రిసార్ట్స్, లైటింగ్ తదితర వాటిని ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- మాడుగుల వీరభద్రస్వామి, మాజీ సర్పంచ్, బొంతలకోడూరు

ఆదిత్యాలయంలో సూర్య నమస్కారాలు


సూర్య నమస్కారాల్లో పాల్గొన్న భక్తులు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో గల అనివెట్టి మండపంలో ఆదివారం పెద్ద ఎత్తున సూర్య నమస్కారాలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఆదిత్యునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి రూ.4,92,812 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.2,14,700, విరాళాల రూపంలో రూ.63,412, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.2,14,812 ఆదాయం లభించిందని ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోండి


ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందిస్తున్న బాధితులు

ఇచ్ఛాపురం: మేనిఫెస్టోలో ప్రకటించనట్టుగా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బాధితులు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం రామయ్యపుట్టుగలోని తన నివాసంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని చెప్పి మోసం చేశారని తెలిపారు. అగ్రిగోల్డ్ యాజమాన్యానికి ఉన్న వేల కోట్ల ఆస్తులను జప్తు చేసి ఉండటమే కాకుండా మరిన్ని వేలకోట్లు బినామీ ఆస్తులుగా యాజమాన్యం చేతులో ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.అరేలమ్మ, తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, గిరిబాబు, వెంకటరావు, భాస్కరరావు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళింగపట్నం అభివృద్ధికి కృషి చేస్తా


ఊరేగింపుగా వెళ్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార: కళింగపట్నం పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక టీడీపీ నాయకులు పొట్నూరు కృష్ణమూర్తి, తాళ్లూరు శివ నరసింహప్రసాద్, పొట్నూరు వైకుంఠరావు, మందుల అన్నాజీరావు, శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌కు పెద్దఎత్తున అభినందన స్వాగతం పలికారు. తొలుత స్థానిక సంత మైదానం వద్ద నుంచి రామకోటి స్తంభం మీదుగా మదీనబాబా దర్గాకు ఊరేగింపుగా చేరుకుని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్న కళింగపట్నం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నందగిరిపేటలో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ బొడ్డేపల్లి సురేష్

శ్రీకాకుళం రూరల్: నందగిరిపేట గ్రామంలో శ్రీకాకుళానికి చెందిన సన్‌రైజ్ ఆసుపత్రి వైద్యులు బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఈ శిబిరంలో పలు వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వ హించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడు తూ.. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటి ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సన్‌రైజ్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి మహానంది పురస్కారం


అవార్డు అందుకుంటున్న కృష్ణారెడ్డి

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన ప్రముఖ శాస్త్రీయ సంగీత కళాకారుడు ఆశి కృష్ణారెడ్డి మహానంది జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహరావు జయంత్యుత్సవాలు సందర్భంగా జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆదివారం తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు విశ్వకళా విరాట్ బ్రహ్మ డాక్టర్ వంగాల శాంతికృష్ణ ఆచార్యులు, హాస్య నటుడు ఆర్‌ఎస్ నంద, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ చేతులు మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

క్రీడాకారులకు అన్నివిధాల సహకరిస్తా

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు


కేంద్రమంత్రిని అభినందిస్తున్న జిల్లా వ్యాయామ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: క్రీడాకారులకు, క్రీడాభివృద్ధికి సహకరిస్తానని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని మంత్రి క్యాంప్ ఆఫీసులో ఆదివారం జిల్లా వ్యాయామ సంఘ ప్రతినిధులు కలిసి అభినందించారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు రైల్వే చార్జీల్లో రాయితీ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని మంత్రిని కోరారు. పేద క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని మంత్రికి వివరించారు. అలాగే జిల్లాలో టోర్నమెంట్‌కి సహకరిస్తానని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ముఖ్య సలహాదారు పి.సుందరరావు, అధ్యక్షుడు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సూరిబాబు, సాధు శ్రీనివాసరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, మెట్ట తిరుపతిరావు తదితరులు ఉన్నారు. అలాగే బహుజన టీచర్ల అసోసియేషన్ ప్రతినిధులు కేంద్ర మంత్రి రామ్మోహన్‌ను కలిసి అభినందించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల ప్రతాప్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి పి.శ్యామ్‌కుమార్, జిల్లా బాధ్యులు ఎస్.రమేష్‌బాబు, ఆమదాలవలస మున్సిపాల్టీ అసోసియేషన్ ప్రతినిధి ఎం.ఏసురత్నం ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసి టీడీపీ నాయకులు

గార: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో శ్రీకూర్మం టీడీపీ నాయకులు కోరాడ వెంకటరావు, కైబాడి రాజు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అలాగే ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక గార మండల సభ్యులు ముంజేటి బాబు, సాయిరాం తదితరులు కేంద్ర మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు.

గుంతలు పూడ్చివేత


జేసీబీతో గుంతలు పూడ్చుతున్న దృశ్యం

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి సమీపంలో అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడడంతో రోడ్లు భవనాలశాఖ అధికారులు పూడ్చారు. ఎమ్మెల్యే రవికుమార్ ఆదేశాలతో ఆదివారం భారీ గుంతలను కొండ గ్రావెల్, మెటల్‌తో పూడ్చివేత పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధికి శంకుస్థాపన చేసినా పనులు ముందుకుసాగలేదు.దీంతో ఈ రోడ్డు ఏర్పడిన గుంతల్లో ప్రతి రోజూ ఇసుక లారీలు, భారీ వాహనాలు ఇరుక్కు పోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తేది. ఈనేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో ఇటీవల ఇదే వైసీపీ అభివృద్ధి అన్న శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో ఎమ్మెల్యే రవికుమార్ తక్షణమే రోడ్లు భవనాల శాఖ అధికారులు ఆదేశించారు.

'ఎమర్జెన్సీ ఘోరాలు ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు'

అరసవల్లి/గుజరాతీపేట: ప్రధాన నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం వికసిత భారత్ సంకల్ప దిశగా ప్రభుత్వం దూసుకుపోతుంటే ఓర్వలేక రాహుల్ గాంధీ టీమ్ అసత్య ప్రచారం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు విమర్శించా రు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో 21 నెలల పాటు ఎమర్జెన్సీ విధించి చీకటి పరిపాలన దేశ ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. అప్పటి ప్రధాని ఇందిరమ్మ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఎలా హరించిందో ప్రజలు మర్చిపోలేదన్నారు. దేశ చరిత్ర పుటల్లో ఆ ఘటన ఎప్పటికీ ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోతుందన్నారు. ఇటువంటి చరిత్ర కలిగిన కాంగ్రెస్ కూటమి మోదీ వంటి నాయకుడిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పార్టీ నాయకులు అట్టాడ రవిబాబ్జీ, చింతపల్లి దుర్గారావు, నంది విజయకుమార్, గురుగుబెల్లి రాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


చిన్నారుల నృత్య సన్నివేశం

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన స్వేచ్ఛానృత్య తరంగణి విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మపథం కళావేదికపై కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు.

పైపులైన్లకు మరమ్మతులు


పనులను పరిశీలిస్తున్న నాయకులు

పొందూరు: పొందూరు పట్టణానికి తాగు నీరందిస్తున్న పైపులైన్లు తరచూ పాడవుతుండడంతో మరమ్మతులపై ఎమ్మెల్యే రవికుమార్ దృష్టి సారించారు. తాగు నీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించిన రవికుమార్ పనులను పర్యవేక్షించాలని పొందూరు పట్టణ టీడీపీ నాయకులకు సూచించారు. దీంతో అధికారులు, నాయకులు ఆదివారం పొందూరు ఏడు ఖానాల సమీపంలో శరవేగంగా మరమ్మతులు పూర్తి చేశారు. పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చైతన్య పొందూరు టీడీపీ పట్టణా ధ్యక్షుడు ఎ.చినరంగ, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు కాలెపు శ్రీనివాసరావు పరిశీలించారు.

ఒక్క రోజులోనే పింఛన్ల పంపిణీ చేపట్టాలి

ఇచ్ఛాపురం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎన్‌టీ ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఒక్కరోజులోనే పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఇచ్ఛాపురం వెలుగు కార్యాలయం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీవోఏలతో సమీక్షించారు. పింఛన్ల పంపిణీలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. అనంతరం కార్యాలయాన్ని పరిశీలించారు. ఏపీఎం సనపల ప్రసాదరావు, వీవోఏలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొనాలి

పొందూరు: పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సోమవారం గ్రామాల్లో జనసేన, బీజేపీ నాయకులతో కలిసి టీడీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్ కోరారు. పొందూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 5.30 గంటల నుంచి అధికారులతో పాటు వెళ్లి ఒక్కరోజులోనే ప్రతిఒక్క పింఛన్‌దారుడికి రూ. ఏడు వేలు అందేలా చూడాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు.

కీడా పరికరాలు పంపిణీ

సరుబుజ్జిలి: మండలంలోని యరగాం యువతకు క్రీడల్లో తన వంతు సహకరిస్తానని టీడీపీ నాయకుడు గురువు తిరుమలరావు తెలిపారు. ఆదివారం గ్రామానికి చెందిన యువకులకు వాలీబాల్ క్రీడా పరికరాలు ఇవ్వడంతోపాటు క్రీడా ప్రాంగణాన్ని తయారు చేయించారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

కవిటి: గ్రామాభివృద్ధికి పాటుపడతానని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ తెలి పారు. శనివారం రాత్రి బెజ్జిపుట్టుగలో అశోక్, నీలోత్పల దంపతులకు సత్కరిం చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పి.కుమారి, పి.కృష్ణారావు, బి.రమేష్, నాయ కులు మణిచంద్రప్రకాష్, ఎస్‌వీ రమణ, ఎ.రాజు, బి.జగన్నాథం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందన

సోంపేట: సోంపేట ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను పట్టణ శ్రీశయన సంఘ ప్రతినిధులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు రెల్ల నారాయణ, కోశాధికారి డి.రాజు, బీన ఆనందరావు, దుద్ది చిరంజీవులతోపాటు బీజేపీ నాయకుడు బీనవంశీ, జనసేన నాయకులు అభినందించారు.

ఖాళీలను వలంటీర్లతో భర్తీ చేస్తాం

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలోని ఒరియా పాఠశాలల్లో ఖాళీ అవుతున్న ఉపాధ్యాయ పోస్టుల స్థానంలో ఉత్కళ్ సమ్మేళన్ ద్వారా వలంటీర్లను భర్తీ చేయనున్నట్లు లింగ్విస్టిక్ మైనారిటీ అధ్యక్షుడు సత్యనారాయణ పాడి తెలిపారు. ఆదివారం కంచిలి రాధాకృష్ణ మందిరం వద్ద ఉత్కళ్ సమ్మేళన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీలు, పదవీ విరమణ వల్ల ఏర్పడిన ఉపాధ్యాయ ఖాళీలను వలంటీర్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీరికి జూలై నుంచి పెంచిన పారితోషికంతోపాటు గౌరవవేతనం అందించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఒరియా డీఐ డీపీచౌదరి, భాస్కర్ పాడి, బృందావన్‌దొళాయి, రామహరి పాడి, విద్యాధర్ బెహరా, ప్రదోష త్రిపాఠి పాల్గొన్నారు.

ఎస్‌డీజీ లక్ష్యంపై అవగాహన

ఇచ్ఛాపురం: ప్రతి గ్రామంలో యువత చైతన్యం కావాలని స్వేచ్ఛా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ కూన విష్ణు మూర్తి తెలిపారు. ఆదివారం ఇచ్ఛాపురంలో ఏఈఈ ఆర్‌డబ్ల్యూఎస్అండ్ఎస్ ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ ఎస్‌డీజీ గోల్స్‌పై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం పోస్టర్‌ను ఎమ్మెల్యే బెందాళం అశోక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం బెనుగానిపేటలో ఎస్‌డీజీ గోల్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ విష్ణుమూర్తి, దుర్యోధనరెడ్డి, డాక్టర్ పూడి కిరణ్‌కుమార్, ఇచ్ఛాపురం మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు హరిశ్చంద్ర, సాయికృష్ణ, విశ్వనాధం, రవికుమార్, సంతోష్, మనోజ్, ప్రవీణ్, బలరాం, రాము, ఎ.కుమారి పాల్గొన్నారు.

తులసమ్మ సంబరం


అలంకరణలో అమ్మవారు

ఇచ్ఛాపురం: లొద్దపుట్టిలో ధనరాజ తులసమ్మతల్లికి పట్టణ పరిధిలో గల పలు వీధుల ప్రజలు సంబరాన్ని నిర్వ హించారు. ఆదివారం అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు. మహిళలు బిందెలతో తీసుకు వెళ్లిన పానకాలు, పంచామృతాలతో అమ్మవారికి అభిషేకించారు.

కోలాట ప్రదర్శన

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ధర్మపథం కార్యక్రమంలో జరిగింది. ఇందులో భాగంగా శ్రీకాకుళం, కాపువీధికి చెందిన సూర్యతేజ కోలాట బృందం చేపట్టిన కోలాట నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

ఆక్రమణల్లో చెరువులు


చెరువు గర్భంలో పంట వేసుకొనేందుకు దుక్కి చేసిన దృశ్యం

ఎల్ఎన్ పేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన చెరువులు ఆక్రమణలకు గురవు తున్నాయి. రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వంశధార నది కుడి ప్రధాన కాలువ దిగువన పంట పొలాలున్నప్పటికీ ఖరీఫ్‌పంటకు చివరి దశలో నీటికొరత ఏర్పడి పంటను నష్టపోవాల్సి వస్తోందని పలుగ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో పెద్దకోట రెవెన్యూ పరిధి అచ్చెవానిచెరువు ఆక్రమణకు గురైంది. ఆక్రమణదారులు చెరువు గర్భాన్ని చదునుచేసి పంట లను పండిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నవిమర్శలొస్తున్నాయి. ఈ చెరువు 20.67 ఎకరాలుండగా సగానికి పైగా ఆక్రమణలకు గురైందని స్థానికులు చెబుతున్నారు. చెరువు రూపాన్నే కోల్పోవడంతో కిందనున్న ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి పంట పొలాలకు సాగునీరందిం చేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.